పాపాల్లో వైసీపీ పెద్దలు..?

నగరపాలక సంస్థలో అనంత అవినీతి
కొలిక్కి వచ్చిన విజిలెన్స్ విచారణ!
అక్రమార్కుల గుండెల్లో గుబులు
నేడు కౌన్సిల్ భేటీలో చర్చకు వచ్చేనా?
6



మొంథా మబ్బులు

ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షం.. ఆకాశం మేఘావృతం.. చల్లగా వాతావరణం

పంటలను ఆశిస్తున్న చీడపీడలు
మరో ఐదు రోజులు వర్ష సూచన

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడితో ముసురు కమ్ముకుంది. వివిధ ప్రాంతాలలో మంగళవారం చిరు జల్లులు కురిశాయి. తాడిపత్రి, యాడికి, ఉరవకొండ, అనంతపురం, గుంతకల్లు, గుత్తి, విడపనకల్లు, నార్పల, కూడేరు, గార్లదిన్నె, పుట్లూరు, శెట్టూరు మండలాల్లో తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. మిగతా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై, చల్లటి వాతావరణం నెలకొంది.

14 మండలాల్లో వర్షం

అనంతపురం జిల్లాలోని 14 మండలాల్లో సోమవారం 31 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉరవకొండలో 8.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 5.3, రాయదుర్గం 4.5, శెట్టూరు 3.9, బొమ్మనహాళ్ 2.2, బ్రహ్మసముద్రం 2.0, విడపనకల్లు 1.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీమీటరు లోపు వర్షపాతం నమోదైంది. ధర్మవరం మండలంలోని కుణుతూరు వద్ద చెక్‌డ్యాంలు పొంగిపోర్లుతున్నారు. గొల్లపల్లి సమీపంలో వంక నీరు

(మిగతా 6వ పేజీలో...)



ధర్మవరం మండలం కుణుతూరు వద్ద చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న వరద



వేదవతి హగరి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు ఎస్పీ జగదీష్ సూచన



అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొంథా తుఫాన్ ముగిసే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ మంగళవారం ప్రకటనలో సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రధాన చెరువులు, వాగులు, వంతెనలు, చెక్‌డ్యాంలు వద్ద పోలీసులు గస్తీ కొనసాగించాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, హగరి, పెన్నా నది పరివాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. వరదలు, రహదారుల పరిస్థితిపై నిఘా కోసం డ్రోన్‌లు ఉపయోగించాలన్నారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, నీటిపారుదల, విద్యుత్‌శాఖాధికారులతో పోలీసులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలు ఎవరూ వాగులు, వంకల్లోకి ఈత కోసం, చేపలు పట్టడం కోసం వెళ్లడం ప్రమాదకరం అన్నారు. వర్షాల వల్ల ఇళ్లు, వృక్షాలు కూలితే తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వాననీరు ఇళ్లను చుట్టుముడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అత్యవసరమైన రెయిన్ కోట్లు, తాళ్లు, అత్యవసర లైట్లు, ఎయిర్ బోట్లు, బ్యాకప్ పవర్ వనరులు సిద్ధం ఉంచుకోవాలన్నారు. వర్షాల వేళ ఏదైనా అవసరమైతే సాయం కోసం జిల్లా ప్రజలు వెంటనే 100లేదా112 కు కాల్స్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేటి నుంచి మహాక్రతువు

- కసాపురంలో కలశ స్థాపన, కుంభాభిషేకం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు





కలశ ప్రతిష్ఠ కోసం తూర్పు గోపురానికి ఏర్పాటుచేసిన నిచ్చెన మెట్లు, ఆలయం ఎదుట హోమాల కోసం ఏర్పాటు చేసిన యాగశాల

గుంతకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో అన్ని గోపురాలకు కలశ స్థాపన, కుంభాభిషేక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయానికి రంగులు వేసే పనులు, దేవస్థానం ఎదురుగా చదును చేయడానికి మట్టి పనులు, మాడ వీధుల ఏర్పాటు, మూడు రోజులపాటు నిర్విరామంగా హోమాలను నిర్వహించడానికి తాత్కాలిక యాగశాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశారు. కార్యక్రమాలను తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. కలశ స్థాపనా కార్యక్రమానికి దూర ప్రాంతాల్లో ఉన్న ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, దాతలను ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో అధికారులు, అర్చకుల బృందం ఆహ్వానించింది.

మూడు రోజుల ఉత్సవం

నెట్టికంటి ఆలయ గోపురాలకు కలశ స్థాపన, కుంభాభిషేక కార్యక్రమాలను పురస్కరించుకుని దేవస్థానంలో మూడు రోజుల పాటు పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 29న ఆలయంలో ప్రాతఃకాల ఆరాధన, పరిషత్ విజ్ఞాపన, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, గోపూజ, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ, రామాయణ, చతుర్వేద పారాయణాలు, మూలమంత్ర, శిఖర కలశాలకు పంచగవ్య స్నపనం, అర్చన, పూర్ణాహుతి, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రామాయణ పారాయణం, చతుర్వేద పారాయణం, చతుస్థానార్చన పూజలు, మహా కుంభ స్థాపన, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, ఉప కుంభారాధన, అగ్ని ముఖం, 18 కలశాలతో నగర యాత్ర, పూర్ణాహుతి, మంగళ శాసనం కార్యక్రమాలను చేపడతారు. 30న యాగశాలలో చతుర్వేద పారాయణాలు, నిత్యారాధన, రామాయణ పారాయణం, నవకలశ స్నపనం, అగ్ని ముఖం, మన్యుసూక్త, సుదర్శన, పంచసూక్త హవనాలు, పూర్ణాహుతి, 18 కలశాల శయ్యాధివాస కార్యక్రమాలను చేపడతారు. 31న పారాయణాలు, పూజాదికాలు, హవనాలు చేపట్టి మహా పూర్ణాహుతి తర్వాత ఉదయం 11-11 గంటలకు శిఖర ప్రతిష్ఠ, మానబలి, దధ్నశాంతి, మహా కుంభ ప్రోక్షణ, మంగళ శాసనం, వేదాశీర్వచన కార్యక్రమాలను చేపట్టనున్నారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి

రూ. 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు

ఏపీ అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల
సమగ్ర సమాచారం లేకపోవడంపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్



అనంతపురం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కమిటీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీ శాసనసభ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల అన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ఎస్సీ కమిటీ మంగళవారం సమావేశం నిర్వహించింది. కమిటీ సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్, కావలి గ్రీష్మ, రోషన్ కుమార్ సొంగ పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లో సమావేశానికి ముందు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ తదితరులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీసు శాఖ పరిధిలో ఎస్సీ అట్రాసిటీ కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి డీఎస్పీలు వివరించారు. 2009 నుంచి ఓ వ్యక్తి కోర్టుకు హాజరు కావడం లేదని, నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉన్నా ఎందుకు పట్టుకోలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు. ఏడాదిలో అట్రాసిటీ కేసులు, బాధితులకు ఇచ్చిన పరిహారం వివరాలను అడిగారు. పూర్తి వివరాలు లేవని డీఆర్వో మలోల అనడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మిస్సింగ్ కేసులు ఎన్ని? వాటిలో ఎస్సీలు ఉన్నారా? అని ఎస్పీని

(మిగతా 7లో...)



అపార్‌మైన వివరాలు

- ఏపీఎస్‌సీహెచ్‌ఈ ప్రొఫెసర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అనిల్‌కుమార్

అనంతపురంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ఐడీతో విద్యార్థుల సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చని ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏపీ అపార్ ఐడి క్రియేషన్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వర్సిటీ అనుబంధ కళాశాలలు, రాయలసీమ యూనివర్సిటీకి చెందిన అనుబంధ కళాశాలలు, జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాల నోడల్ కోఆర్డినేటర్లు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, బోధనా సిబ్బంది ఈ వర్క్‌షాపునకు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన ప్రొఫెసర్ అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా అపార్ క్రియేషన్‌కి సంబంధించిన వాటి గురించి క్లుప్తంగా వివరించారు. డిజిటల్ ఇండియా కార్పొరేషన్ జోనల్ కో ఆర్డినేటర్ రవి పాండే, యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ అధికారి రోహిత్ శర్మ, ఏపీఎస్‌సీహెచ్‌ఈ సభ్యులు ఎల్లారెడ్డి వర్క్‌షాపులో పలు సూచనలు చేశారు. పాఠశాలలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని వివరాలు అపార్‌లో ఉంటాయన్నారు. విద్యార్థి పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డెరెక్టరేట్ ఆఫ్ ఎవాల్యూయేషన్ డైరెక్టర్ ఆచార్య జీవి రమణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ శ్రీరాములు నాయక్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఆచార్య రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రసీదు ఇవ్వని ఎరువుల దుకాణంపై చర్యలు?

నేడు అనంత కృషిభవన్‌లో డీలర్లతో ప్రత్యేక సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో నిబంధనల అతిక్రమణలపై 'నిబంధనలు గాలికి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై జిల్లా వ్యవసాయ యంత్రాంగం స్పందించింది. కూడేరు మండలం కమ్మూరుకు చెందిన రైతు లక్ష్మీనారాయణ కొనుగోలు చేసిన అగ్రోమిన్ మ్యాక్స్ 4 కేజీలు, 19-19-19 ఎరువులు 3 కేజీలకు సంబంధించిన రసీదు ఇవ్వకపోవడంపై అనంతపురం ఆర్టీసీ బస్టాండు రోడ్డులోని సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. రసీదు ఇవ్వకపోవడంపై జారీచేసిన షోకాజు నోటీసుకు సదరు డీలర్ వివరణ ఇచ్చాడనీ, త్వరలో చర్యలు తీసుకుంటామని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. నగరంలోని కృషి భవన్‌లో అనంతపురం అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లకు బుధవారం సాయంత్రం 3.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామన్నారు. డీలర్లు పాటించాల్సిన నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఏడీఏ తెలిపారు.

అనధికార మద్యం అమ్మకాలపై కొరడా

మూడు కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు



తనిఖీలు చేస్తున్న సీఐ సత్యనారాయణ, ఇతర అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ పోలీసులు కొరడా ఝుళిపించారు. దాడులు చేసి అనధికార మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేశారు. అనంతపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు, ఈఎస్ టాస్క్‌ఫోర్స్, విజయవాడకు చెందిన ఎస్‌టీఎఫ్ టీం అధికారులు బృందాలుగా ఏర్పడి, విస్తృతంగా తనిఖీలు చేశారు. ఏ నారాయణపురం గ్రామానికి చెందిన చాకలి నాగేంద్ర నుంచి 30, అనంతపురం రూరల్‌లోని పంగల్ రోడ్డులో ఉంటున్న సాకే నాగలక్ష్మి నుంచి 34, కక్కలపల్లికి చెందిన బుడగం మునలప్ప నుంచి 42 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ సీఐ జయనాథరెడ్డి, ఎస్‌టీఎఫ్ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ సర్..!

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణలో తీరిక లేకుండా గడిపే పోలీసులు.. కాస్త తీరిక చేసుకుని, మానవ సేవకు ఉపక్రమించారు. మానసిక వైకల్యంతో నగరంలో సంచరిస్తున్న ఐదుగురు నిరాశ్రయులకు వన్‌టౌన్ పోలీసులు దారి చూపారు. ఒక మహిళ, నలుగురు పురుషులను వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, పోలీసులు సిబ్బంది గుర్తించి, కడప జిల్లాకు చెందిన మనోబంధు ఫౌండేషన్ ట్రస్టుకు మంగళవారం అప్పగించారు. తమ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేకుండా రేయింబవళ్లు సంచరిస్తున్న ఐదుగురిని గుర్తించామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



మనోబంధు ట్రస్టుకు అప్పగిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

వారికి వైద్యం, ఆవాసం కోసం కడప రిమ్స్ ఆసుపత్రిలోని మనోబంధు ట్రస్టుకు అప్పగించామని తెలిపారు. వారు కోలుకున్న తరువాత బంధువులను గుర్తించి, అప్పగిస్తారని తెలిపారు.

యాచకురాలిపై అత్యాచారయత్నం

నార్పల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ఓ యాచకురాలిపై అత్యాచారయత్నం జరిగింది. నార్పలకు చెందిన యువకుడు అతిగా మద్యం తాగాడు. మద్యం దుకాణానికి కాస్త దూరంగా యాచకురాలు నిద్రిస్తుండటం చూశాడు. ఆమెపై అత్యాచారం చేయబోయాడు. ఆమె అరుపులు విని అక్కడికి వచ్చిన స్థానికులు ఆ మందుబాబుకు దేహశుద్ధి చేశారు. ఆ యువకుడు దెబ్బలు తిన్న తర్వాత కూడా అక్కడే ఉన్న ఏటీఎంలో నిద్రపోయాడు. ఈ ఘటన నార్పలలో దావానలంలా వ్యాపించింది. సోషల్ మీడియాలో వైరల్ అయింది. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, మహిళా పోలీసులతో కలిసి ఆ యాచకురాలిని విచారించారు. మద్యం మత్తు నుంచి కోలుకుని పరారైన దుండగుడి కోసం గాలింపు చేపట్టారు. యాచకురాలిని స్వగ్రామమైన ప్రొద్దుటూరుకు తీసుకెళ్లి, కుటుంబికులకు అప్పగించారు.

ఏమిటీ.. వందశాతం హాజరా..?

- కార్మికుల మస్టర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విస్మయం
- తెల్లవారుజామున అనంత రెండో సర్కిల్‌లో తనిఖీ



పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం క్రైం/క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణపై రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి మంగళవారం తెల్లవారుజామున కోర్టురోడ్డులోని పబ్లిక్‌హెల్త్ కార్యాలయం ఆవరణలో ఉన్న రెండో సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు మస్టర్‌ను పరిశీలించి, వంద శాతం హాజరు ఉండటంతో విస్మయం వ్యక్తం చేశారు. నెలరోజుల్లో ఒక్కరు కూడా గైర్హాజరుకాలేదా అని అధికారులను ప్రశ్నించారు. లేదని వారు అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో సర్కిల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డు సచివాలయ కార్యదర్శులు ఎంతమంది వచ్చారు? ఎక్కడెక్కడ విధుల్లో ఉన్నారని ఆరా తీశారు. రోజు ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మురుగు రహిత, పరిశుభ్ర నగరస్థాపనలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ: ఎస్పీ



రక్తదానం చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం అంటే మరొకరికి పునర్జన్మ ఇవ్వడమేనని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని షాదీఖానాలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిబ్బన్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. తర్వాత స్వయంగా రక్తదానం చేశారు. ఎస్పీతోపాటు సీఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐలు, వందలాది మంది సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్లు, ఇతర అత్యవసర సమయాల్లో రక్తం చాలా అవసరం అన్నారు. అలాంటి సమయంలో మానవత్వంలో రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. పదకొండు మందికి గాయాలు



గాయపడిన కూలీలు

ఉరవకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ సహా పదకొండు మంది గాయపడ్డారు. ఉరవకొండకు చెందిన పదిమంది వ్యవసాయకూలీలు వేరుశనగ పొలంలో పనులు చేసేందుకు మూలగిరిపల్లికి ఆటో బయల్దేరారు. అదే సమయంలో అనంతపురం వైపు నుంచి వస్తున్న కారు చిన్నముష్టూరు వద్ద ఢీకొట్టింది. దీంతో కూలీలతో పాటు ఆటో డ్రైవర్ చిన్నా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఎర్రమ్మ, జయలక్ష్మి, మణి, హేమలత, సువర్ణ, సుచిత్ర, బొజ్జమ్మ, సుజాత, సులోచన, చిన్ని గాయపడ్డారు. వీరిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

రోగాలు వస్తాయ్.. జాగ్రత్త: డీఎంహెచ్‌ఓ



అనంతపురం వైద్యం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, ఆయా ప్రాంతాల్లోని వైద్యులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. ప్రాథమిక వైద్యకేంద్రాలు, పట్టణ వైద్యకేంద్రాల డాక్టర్లతో మంగళవారం ఆమె జూమ్ మీటింగ్‌ను నిర్వహించారు. అపరిశుభ్రత, నీటి కాలుష్యం, అంటువ్యాధులు ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తాయని హెచ్చరించారు. ఆస్పత్రికి వచ్చేవారికి అన్నిరకాల వైద్యసేవలు అందించాలని సూచించారు. వందశాతం సిబ్బంది విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిమ్మంపల్లి, నాగసముద్రం, బొమ్మనహాళ్ డాక్టర్లు విధులకు హాజరుకావడం లేదని మెమోలు జారీ చేశారు.

సమీక్షలో డీఎల్‌టీఓ జయలక్ష్మి, పీఓలు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, డీఎస్‌ఓ మహ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఎపిడమిక్ సెల్ అధికారులు బలంరామ్‌రెడ్డి, వెంకటేష్, ఈఓ జరీనా తదితరులు పాల్గొన్నారు.

మొంథా మబ్బులు

(5వ పేజీ తరువాయి)

గొట్లూరు చెరువుకు చేరుతోంది.

భారీ వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి మంగళవారం తెలిపారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 29న 2 సెం.మీ., 30న ఒక సెం.మీ., 31న 0.2 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఈ నె 29న 2 సెం.మీ., 30న ఒక సెం.మీ., 31న 0.1 సెం.మీ., వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు 27-33.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.5-23.6 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 10-18 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 81-88, మధ్యాహ్నం 58-80 శాతం నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

రైతులకు శాస్త్రవేత్తల సూచన

● ఆముదం పంటలో బూజు కనిపిస్తోంది. దీని నివారణకు కార్బండజిం ఒ గ్రాము, లదా థయోపెనేట్ మిథైల్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కోత పనులు వాయిదా వేసుకోవాలి. అత్యవసర సమయంలో స్థానిక వాతావరణ పరిస్థితులు గమనించి, వ్యవసాయ పనులు చేసుకోవాలి.

●వరి పంటలో కంకి ప్రారంభం దశ నుంచి గింజ అభివృద్ధి దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ ఆశించింది. నివారణకు అసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పైమెట్రోజిన్ 0.6 గ్రాము లేదా డైనోటెఫ్యూరాన్ 0.4గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో బాక్టీరియా, ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు కాపర్ హైడ్రోక్సైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచాకారి చేయాలి.

● పత్తి పంట పూత దశ నుండి కాయ అభివృద్ధి దశలో ఉంది. రసం పీల్చు పురుగులు ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. తెల్లదోమ ఉధృతిని గమనించడానికి పొలంలో పసుపు, నీలం రంగ అట్టలు ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేయాలి. ఉధృతిని బట్టి ఇమిడాక్లోప్రైడ్ 0.4 మి.లీ. లేదా థయోమెథాక్సామ్ 25 డబ్ల్యూజీ 0.2 లేదా అసిటామప్రేడ్ 0.2 గ్రాము లీటర్ నీటికి, లేదా థయామెథాక్సామ్, ఫిప్రోనిల్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● అరటిని సిగటోక తెగులు ఆశించే ప్రమాదం ఉంది. దీని నివారణకు టిల్ట్ 0.5 మి.లీ. లేదా కవచ్ 2 గ్రామ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మిరప పంటలో అక్కడక్కడ శాఖీయ దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు సూది పురుగు ఆశించే ప్రమాదం ఉంది. నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచాకారీ చేయాలి.

● చీనీ పంటను పొలుసు పురుగు ఆశిస్తోంది. నివారణకు కాండాన్ని, కొమ్మలను గోనే పట్టాతో రుద్ది కెలియోల్ అయిల్ 5 మి.లీ. లేదా హార్టి మినరల్ ఆయిల్ 5 మి.లీ. డైమిథోయేట్ 2 మి.లీ. లేదా బ్రూఫోజిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపే మొక్క బాగా తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

పెన్నా నదికి నీటి విడుదల

తాడిపత్రి: తుఫాన్ నేపథ్యంలో చాగల్లు రిజర్వాయర్‌కు వరద పెరుగోతంది. దీంతో ప్రాజెక్టు నుంచి నుంచి 600 క్యూసెక్కుల నీటి పెన్నా నదికి విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు పైనుంచి 700 క్యూసెక్కుల వరద వస్తోంది. నది పరివాహక ప్రాంతాల ఉన్న ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పీఏబీఆర్ నుంచి..



జలవిద్యుత్ కేంద్రం వద్ద కరెంటు అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ వెంకటరమణ

కూడేరు: తుఫాన్ నేపథ్యంలో పీఏబీఆర్ నుంచి జలవనరుల శాఖ అధికారులు దిగువకు భారీగా నీరు వదులుతున్నారు. హంద్రీనీవా, లింక్ ఛానల్ నుంచి డ్యాంలోకి 1000 క్యూసెక్కుల నీరు వస్తోంది. డ్యాం నుంచి రెండు గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. జలవిద్యుదుత్పత్తికి 985 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇరిగేషన్ ఈఈ శశిరేఖ, డీఈ వెంకటరమణ విద్యుదుత్పత్తి గురించి మంగళవారం ఆ శాఖ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం డ్యాం నీటి మట్టం 435.750 మీటర్లకు చేరుకుని, 5.357 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు గేట్లు ఎత్తే అవకాశం



సీబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

తాడిమర్రి: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరుతోంది. ఇన్నాళ్లూ గండికోట నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా డ్యాంకు నీరు చేరుకోగా, ఇప్పుడు వర్షపు నీరు తోడైంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 9.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.3 టీఎంసీలకు చేరిందని ఏఈ అనీఫ్ తెలిపారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఆ నీరు కూడా చిత్రావతికి చేరుతుంది. మొత్తంగా 800 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. ఉన్నతాధికారుల అనుమతితో బుధవారం డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలే అవకాశం ఉందని ఏఈ తెలిపారు.

కూలిన ఇల్లు



హరేసముద్రంలో కూలిన ఇల్లు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని హరేసముద్రంలో తుఫాను ప్రభావంతో ఓ ఇల్లు కూలిపోయింది. ప్రకాష్ అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, పిల్లలు, తల్లి గౌరమ్మతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటిపైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. వెంటనే వారు బయటకు వచ్చారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ మునివేలు బాధితులను పరామర్శించారు. నివేదిక ఇవ్వాలని వీఆర్వోకు సూచించారు. పలు గ్రామాలను సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను ప్రభావం ఉన్నందున మొక్కజొన్న కోతలను విరమించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ సూచించారు. బీటీపీ నుంచి వరద నీటిని హగరికి విడుదల చేశారు. దీంతో కల్లుదేవనహళ్లి, బండూరు రోడ్డులో వేదవతి హగరి వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

బాధ్యతగా పనిచేయండి

● జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హతలను పరిగణనలోకి తీసుకకుని ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించామని, ప్రజలకు బాధ్యతగా సేవలు అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. జడ్పీలో ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో తన చాంబర్‌లో చైర్‌పర్సన్ ఉద్యోగోన్నతి, కేటాయించిన స్థానాల ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. పెద్ద వడుగూరు ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే ఫణిశేఖర్ రెడ్డి, గార్లదిన్నె కార్యదర్శి ముత్యాలరెడ్డికి జడ్పీ కార్యాలయాన్ని కేటాయించారు. అనంతపురంలోని పీఆర్ క్యూసీలో పనిచేసే రవిని వజ్రకరూరు ఎంపీపీ కార్యాలయాన్ని కేటాయించారు. నల్లమాడ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే లోకమల్లికార్జున రెడ్డికి అమడగూరు ఎంపీపీ కార్యాలయాన్ని, బొమ్మనహాళ్ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే హనుమంతప్పను గుమ్మఘట్ట ఎంపీపీ కార్యాలయానికి, ఉరవకొండ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే క్రిష్ణనాయక్‌ను బెళుగుప్ప ఎంపీపీ కార్యాలయానికి, అనంతపురంలోని డ్వామా కార్యాలయంలో పనిచేసే మల్లికార్జునను బత్తలపల్లి ఎంపీపీ కార్యాలయానికి ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు.

సీఏఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏల పరిపాలన విభాగంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కింద వివిధ విభాగాల ఆచార్యుల ఉద్యోగోన్నతికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అధ్యక్షతన వివిధ బోర్డుల చైర్మన్లు, సభ్యులు, అనుభవజ్ఞులైన ఆచార్యులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఉద్యోగోన్నతుల ద్వారా మెకానికల్, ఈఈఈ, ఫిజిక్స్ విభాగంలో ఆచార్యులను భర్తీ చేస్తున్నారు. డీపీ ఆచార్య సత్యనారాయణ, ప్యానల్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తామని సీఈఓ శివశంకర్ మంగళవారం తెలిపారు. 1 నుంచి 7 వరకు అంశాలకు సంబంధించి అజెండా అంశాలను సిద్ధం చేశామని తెలిపారు. అజెండాకు అనుగుణంగా పలు అంశాలపై చర్చలు జరిపి, తీర్మానాలకు ఆమోదం తెలుపుతామని వెల్లడించారు. గౌరవ సభ్యులు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏఓ లకు, మరో ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఓలలో శివశంకర్ శర్మ, వెంకటచలపతి, గంగాధర్, రత్నాబాయి, నాగేంద్రకుమార్, రామ్‌కుమార్, రామకృష్ణ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. శివకుమార్ శర్మ ప్రస్తుతం విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్నారు. అదే విభాగానికి ఎంపీడీఓగా నియమించారు. నాగేంద్ర కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. అక్కడి అధికారులు మండలాన్ని కేటాయిస్తారు.మిగిలిన వారికి ఉమ్మడి జిల్లాలో జడ్పీ సీఈఓ శివశంకర్ స్థానాలను కేటాయిస్తారు. డిప్యూటీ ఎంపీడీఓలలో దామోదరమ్మ, రాధాకృష్ణ, దేవదాస్, హరికృష్ణ బాలాజీ, రఘురామ్, అశోక్‌కుమార్‌రెడ్డి, దివాకర్ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి జడ్పీ సీఈఓ మండలాలను కేటాయిస్తారు.

క్రీడాపోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలను వాయిదా వేస్తున్నామని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. తదుపరి క్రీడాపోటీల నిర్వహణ, ఇతర వివరాల కోసం 08554-315632 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయాల్లో విజిలెన్స్ వారోత్సవాలు

అనంతపురం విద్య, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. కార్యదర్శి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిగ్రంథాలయంలో 2వతేదీ వరకు వేడుకలు కొనసాగుతాయన్నారు. అనంతరం ఆ శాఖ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో అందజేసే నగదు ప్రోత్సాహక పథకానికి అర్హులైన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ మంజుల సూచించారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో ప్రకటించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను నగదు పురస్కారాలతో సత్కరిస్తామని తెలిపారు. అర్హులు నవంబరు 4వ తేదీలోపు SAAP kreeda app@https://sports.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08554-315632, 7989090758 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాపాల్లో వైసీపీ పెద్దలు..?

కొలిక్కి వచ్చిన విజిలెన్స్ విచారణ

నగరపాలక సంస్థలో 'అనంత' అవినీతి
అక్రమార్కుల గుండెల్లో గుబులు
నేడు కౌన్సిల్ భేటీలో చర్చకు వచ్చేనా?



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగర పాలక సంస్థలో కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం వ్యవహారంలో పెద్దల పాత్ర ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొలిక్కి వస్తున్న క్రమంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి, మేయర్ పాత్రపై నిగ్గు తేలనుందా... అనే చర్చ సాగుతోంది. 2019-24 మధ్యకాలంలో అక్రమాలపై విజిలెన్స్ అధికారుల విచారణతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఆ అక్రమాలపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.. కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు మూడు నెలలుగా విచారణ చేస్తున్నారు. కొలిక్కి వచ్చినట్లు సమాచారం. దీంతో అప్పట్లో పనిచేసిన అధికారులు, ఇంజనీర్లు, వైసీపీ ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదలైంది. 2019-24 మధ్య వైసీపీ హయాంలో కొనుగోలు చేసిన పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డు, నగరంలో బ్యూటిఫికేషన్, ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ కట్టడాలు అంశాలపై విచారణ కొనసాగుతోంది. వైసీపీ హయాంలో అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి రూ.లక్షల్లో కమీషన్లు దోచుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచిందన్న వాదనలున్నాయి. బ్లీచింగ్ చల్లకనే చల్లినట్లు, పనిముట్లు కొనుగోలు చేయకనే రూ.లక్షలాది రూపాయల బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం నిర్వహించే నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో విజిలెన్స్ విచారణ ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

రూ.కోట్లలో అవినీతిపై ఆరా

గత వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య కాలంలో అనంత నగరపాలక సంస్థలో పనిముట్ల కొనుగోలుకు రూ.30లక్షలు, బ్లీచింగ్ పౌడర్‌కి రూ.67లక్షలు, బ్యూటిఫికేషన్ కోసం రూ.6 కోట్లు, డంపింగ్ యార్డుకు సంబంధించి రూ.23 కోట్లు మంజూరు చేయగా.. రూ.12కోట్లు అప్పట్లోనే చెల్లించారు. ఇలా ఐదేళ్లలో విచ్చలవిడిగా రూ.30కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పట్లో ఇంజనీరింగ్ విభాగంలో డీఈగా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో రూ.కోట్ల అవినీతిలో భాగమైన అధికారిని తిరిగి ఇక్కడికి ఎలా నియమిస్తారనే అంశంపై ఏఎంసీలో జోరుగా చర్చ సాగుతోంది. అప్పటి వైసీపీ నేతలతో ఆ అధికారి కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రజాసొమ్మును దుర్వినియోగం చేశాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డంపింగ్ యార్డు

పనులు చేయకనే రూ.23 కోట్లు స్వాహా

వైసీపీ హయాంలో డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేశారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్భాలు పలికినా ఒక్క అడుగు కూడా పడలేదు. చెత్తను తరలించే పేరుతో రూ.23కోట్ల వరకు బిల్లులు చేసి మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. అప్పట్లోనే ఒకే సమయంలో రూ.12కోట్లు బిల్లులు చెల్లించారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పొరేటర్లు బహిరంగంగానే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం.

వైసీపీ నిర్వాకంతో రూ.75కోట్ల పన్నులు పెండింగ్

గత వైసీపీ ప్రభుత్వంలో నగర పాలక సంస్థ ఓ న్యాయవాదిని నియమించుకుంది. దీంతో నగరపాలక సంస్థకు నీటి, ఆస్తి పన్ను వసూలు చేయకుండా ప్రజలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. దీంతో నగరపాలక సంస్థకు రావాల్సిన రూ.75కోట్ల ఆదాయంపై ప్రభావం పడింది. ఇందులో 400మందికి పైగా నోటీసులు ఇచ్చారు. నగర పాలక సంస్థకు న్యాయవాది అవసరమా అనే ప్రశ్న తలెత్తుతోంది.

విజిలెన్స్ అధికారులకు వివరాలు అందజేశాం

నగరపాలక సంస్థలో విజిలెన్స్ విచారణ జరుగుతున్న మాట వాస్తవమే. అధికారులు అడిగిన అన్ని వివరాలు అందజేశాం. విచారణకు సహకరించాం.

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

అప్పటి ప్రజాప్రతినిధులదే బాధ్యత

గత వైసీపీ ప్రభుత్వంలో నగరపాలక సంస్థలో జరిగిన అక్రమాలకు అప్పటి ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలి. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. విజిలెన్స్ విచారణతో నిజాలు తేలుతాయి. అక్రమాల్లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే, మేయర్ పాత్ర విజిలెన్స్ అధికారుల నివేదికలో తేలనుంది. ప్రజాధనం వడ్డీతో సహా కక్కిస్తాం. డంపింగ్ యార్డులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

-దగ్గుపాటి ప్రసాద్, అనంత అర్బన్ ఎమ్మెల్యే

వేవేల చరిత



శాసనాలను చూపుతున్న ఉపాధ్యాయుడు బుక్కపట్నం గోపి

ధర్మవరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే అత్యంత పురాతన దేవాలయాల్లో ఒకటిగా మండలంలోని కుణుతూరు గ్రామంలో ఉన్న చంద్రమౌళీశ్వర ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని వెయ్యి సంవత్సరాల కిందటే నిర్మించినట్లు లభించిన ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ లభించిన శిలా శాసనాలు చరిత్రను నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. ఊరికి ఉత్తరాన ఉన్న ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు కాలభైరవుడు. ఈ ప్రాంతం ఎంతోమంది రాజుల ఏలుబడిలో విలసిల్లినట్లు లభించిన శాసనాల ద్వారా తెలుస్తోంది. పశ్చిమ చాళుక్యులు, హొయసాలలు, దేవగిరి యాదవులు, విజయనగర రాజ్యపాలకులు ఇలా వివిధ రాజ వంశీయుల ఏలుబడిలో ఈ ఆలయం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి రాజులు చంద్రమౌళేశ్వరుడిని సందర్శించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. లేపాక్షి ఆలయం కంటే కూడా ఇది పురాతణమైనదిగా చరిత్రకారులు చెబుతున్నారు.

గోపి పరిశోధనతో వెలుగులోకి..

కొత్తచెరువు మండలం వంగంపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బుక్కపట్నం గోపి జిల్లాలో పలు శాసనాలను గుర్తించి, వాటి చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. మూడు నెలల కిందట ఈయన కుణుతూరులోని చంద్రమౌళీశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయం ఎదుట ఉన్న శిలాశాసనాన్ని గమనించారు. రాతిస్తంభం మీద చెక్కిన ప్రాచీన శాసనాన్ని గుర్తించారు. కన్నడ భాషలో ఉన్న ఆ శాసనాన్ని కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని భారతపురావస్తుశాఖ కార్యాలయం డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపారు. ఆయన దాన్ని పరిశోధించి, అందులో ఉన్న సమాచారాన్ని ఉపాధ్యాయుడు గోపికి పంపారు. దాని ప్రకారం ఆ శాసనాన్ని క్రీ.శ 1218వ సంవత్సరం అక్టోబరు 22న దేవగిరి యాదవరాజు రెండో సింహనుడు (సింగనుడు)వేయించారు. ఈ శాసనం ప్రకారం చంద్రమౌళీశ్వరాలయానికి కొన్ని భూములను మాన్యంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండో సింహనుడి తరఫున మహామండలేశ్వర అభ్యారసదేవ చోళమహారాయ భూమిని కానుకగా సమర్పించినట్లు శాసనంలో రాశారని గుర్తించారు. గ్రామంలో రెండో సింహనుడి శాసనంతో పాటు మరో రెండు ప్రాచీన శాసనాలు కూడా ఉన్నట్లు భారత పురావస్తు శాఖ డైరెక్టర్ తెలిపినట్లు పరిశోధకుడు గోపి ద్వారా తెలిసింది.

పదో శతాబ్దంలో ఆలయ నిర్మాణం

చంద్రమౌళీశ్వర ఆలయాన్ని, అక్కడే ఉన్న వినాయకుడి ఉపాలయాన్ని పశ్చిమ చాళుక్యులు క్రీ.శ 10వ శతాబ్దంలో నిర్మించినట్లు రెండు శాసనాల ద్వారా తెలుస్తోంది. కొల్లాపురమ్మ ఆలయాన్ని కూడా అప్పట్లోనే నిర్మించినట్లు తెలుస్తోంది. ఊరికి ఉత్తరాన ఉన్న ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉంది. అప్పట్లో ఆలయ సమీపంలో స్నానమాచరించేందుకు పెద్దవంకను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలో ఉన్నది అరుదైన బ్రహ్మసూత్రం కలిగిన శివలింగంగా పరిశోధనలో చరిత్రకారులు గుర్తించారు.



క్రీస్తుశకం 1218లో ఆలయం ఎదుట చెక్కించిన శిలశాసనాలు

ఆలయానికి 16 ఎకరాల మాన్యం

ఆలయానికి గ్రామంలో 16 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూమిని ఆలయ అర్చకుడి ద్వారా రైతులకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని స్వామివారి పూజలు, ధూప దీప నైవేద్యాలకు ఉపయోగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.


జైనులు నిర్మించిన జయనేశ్వర ఆలయం

గ్రామంలో పురాతన చంద్రమౌళీశ్వర ఆలయం పక్కనే జయనేశ్వరాలయం ఉంది. ఈ ఆలయాన్ని జైన మతస్థులు నిర్మించినట్లు , ఆలయంలో శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. జయనేశ్వరాలయానికి గతంలో 18ఎకరాల మాన్యం కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ భూమి అన్యాక్రాంతం అయినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ఆలయాన్ని జయమ్మ ఆలయంగా గ్రామస్థులు పిలుస్తున్నారు. దేవాలయ గొప్పతనాన్ని, వైభవాన్ని ప్రజలందరికీ తెలిసేలా దేవదాయశాఖ తగు చర్యలు తీసుకోవాలని పరిశోధకులు, చరిత్రకారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



కుణుతూరులో వెలసిన పురాతన చంద్రమౌళీశ్వర ఆలయం


ఆలయానికి వస్తే మనశ్శాంతి



మా గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి చంద్రమౌళేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానికి చాలా మంది వస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చేదేవుడిగా ఇక్కడి స్వామి ప్రసిద్ధికెక్కారు. ఈ దేవాలయానికి వస్తే మనశ్శాంతిగా ఉంటుంది.

- పాగాల లక్ష్మీదేవి, కుణుతూరు, ధర్మవరం మండలం

చిన్నప్పటి నుంచి వెళ్తున్నా




మా ఊర్లోని చంద్రమౌళేశ్వర ఆలయానికి నేను చిన్నప్పటి నుంచి వెళుతున్నా. ఎక్కడాలేని విధంగా బ్రహ్మసూత్రం కలిగిన శివలింగం ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ స్వామివారిని ఏమి కోరినా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కాలభైరవుడు, గణపతి స్వామివార్లు ఆలయంలో ఒకేచోట ఉండటంతో అందరిని దర్శించుకుంటాం. ప్రతి ఏటా కార్తీకమాసం, మాఘమాసంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. దేవదాయశాఖ అధికారులు ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

-సదాశివగౌడ్, కుణుతూరు, ధర్మవరం మండలం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవి తేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.




ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్టే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్ర పోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకోనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు.. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

వైసీపీకి షాక్..!

- తిరగబడ్డ ఎంపీటీసీలు... బెళుగుప్ప ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వద్దంటూ ఆర్డీఓకి వినతి



ఆర్డీఓకి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ ఎంపీటీసీలు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి ఆ పార్టీ ఎంపీటీసీలు షాకిచ్చారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలో ఎదురు తిరిగారు. ఎంపీపీ పెద్దన్నను అవిశ్వాసం పెట్టి ఒక్కరోజైనా పదవి నుంచి దించాలన్న వైసీపీ నాయకుల అంచనాలను తారుమారు చేశారు. అవిశ్వాస తీర్మానం వద్దు అంటూ ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు మంగళవారం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం ఇచ్చారు. అప్పట్లో వైసీపీ నాయకులు మభ్యపెట్టి అవిశ్వాస తీర్మానంపై తమతో సంతకాలు చేయించారనీ, ఆ నిర్ణయాన్ని వెనక్కుతీసుకుంటున్నామని వారు తెలిపారు. బెళుగుప్ప, శీర్పి, తగ్గుపర్తి, బెళుగుప్ప తండా, కాలువపల్లి నుంచి టీడీపీలోకి చేరిన వారు.. ఎంపీపీ పెద్దన్నకు మద్దతు పలికారు. అనంతపురంలో జడ్పీ సీఈఓకు కూడా వినతిపత్రం ఇచ్చారు. ఎంపీపీగా పెద్దన్నను కొనసాగించాలని ఆర్డీఓను కోరారు. మరికొందరు వైసీపీ ఎంపీటీసీలు మద్దతు తెలిపే అవకాశాలున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. అప్పట్లో టీడీపీ పోటీ నుంచి తప్పుకోవడంతో అందరూ వైసీపీ సభ్యులే ఏ కగ్రీవమయ్యారు. ఎంపీపీగా పెద్దన్నను ఎన్నుకున్నారు. ఆయన సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. అయనను ఎంపీపీ పీఠం నుంచి దించాలని వైసీపీ నాయకులు భావించారు. తమకే సంపూర్ణ బలం ఉందనీ, అవిశ్వాసం నెగ్గుతామని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పది మంది ఎంపీటీసీలు.. అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని ఆర్డీఓకి వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ పెద్దన్నతోపాటు ఐదుగురు సభ్యులు అవిశ్వాసం వద్దు అంటూ ఆర్డీఓ, జడ్పీ సీఈఓకి వినతిపత్రాలు ఇవ్వడం గమనార్హం. మరికొందరు ఎంపీటీసీలు.. టీడీపీలోకి చేరుతారన్న ప్రచారం నేపథ్యంలో అవిశ్వాస తీర్మనంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

బైక్‌లు ఢీకొని యువకుడి దుర్మరణం

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలు ఢఢీకొన్న ప్రమాదంలో బెంగళూరుకు చెందిన గణేష్(23) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణేష్ సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం తిరుగు ప్రయాణమయ్యాడు. నాగినాయనిచెరువు తండాకు చెందిన గోపాల్‌నాయక్ సోమందేపల్లిలో చదువుతున్న మనవరాలిని పిలుచుకుని స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా గణేష్ ఢీకొట్టాడు. ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గోపాల్‌నాయక్, అతడి మనవరాలు గాయపడ్డారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.12, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. 40 కేసులు ఉన్నాయని, కులాలవారిగా వేరు చేయలేదని సమాధానమిచ్చారు. అట్రాసిటీ కేసులను సీరియస్‌గా తీసుకోవాలని కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల సూచించారు.

అధికారుల తడబాటు

సాంఘిక సంక్షేమ శాఖ పథకాల గురించి సోషల్ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి వివరిస్తుండగా ఎమ్మెల్యే రాజు కల్పించుకున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎంత..? వేటి కోసం ఖర్చు చేశారో వివరంగా చెప్పాలన్నారు. నోట్‌లో క్లియర్‌గా ఉందని ఆమె సమాధానం ఇచ్చారు. 'అందులో ఉన్నవి సరే..! మీరు చెప్పండి' అని ఎమ్మెల్యే అడగడంతో ఆమె తడబడ్డారు. క్షేత్రస్థాయిలో రిపోర్ట్ లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. 2019-24లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. నూతనంగా ఎస్సీ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఎస్సీ కమ్యూనిటీకి, శ్మశాన వాటికలకు స్థలం, రహదారి, ప్రహరీ ఏర్పాటుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఎస్సీలకు పీఎం అజయ్ తదితర పథకాల కింద లబ్ధి చేకూర్చాలని కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ సూచించారు. స్పెషల్ డ్రైవ్ కింద శ్మశానవాటికల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రాజు సూచించారు. శ్మశాన వాటికల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ గంజాయి ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కావలి గ్రీష్మ ఎస్పీని కోరారు. ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ సమాధానమిచ్చారు.

రిజర్వ్‌డు ఎమ్మెల్యేలంటే అంత ఇదా?

ఎస్సీలకు ఇళ్ల మంజూరు విషయంపై కమిటీ సభ్యులు మాట్లాడుతూ పొజిషన్ సర్టిఫికెట్ జారీ ఉన్న ఇబ్బందులు పరిష్కరించాలన్నారు. హౌసింగ్ పీడీ శైలజ పరిస్థితి వివరించారు. ఇదే సందర్భంలో మీరు వాట్సాప్ స్టేటస్ ఏం పెట్టారమ్మా అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు. మీకు రిజర్వుడు ఎమ్మెల్యేలు అంటే అంత ఇదా అన్నారు. బై మిస్టేక్ అయింది సర్ అంటూ ఆమె చెప్పే ప్రయత్నం చేశారు. ఎలా మిస్ అవుతుందమ్మా...మీ మీద నాకేమైనా కక్షా...మీ పేరు కూడా తెలియదు నాకు, పొలిటికల్ లీడరా మీరు? రిజర్వుడు ఎమ్మెల్యేలను మీరు చూసే కోణం వేరు అంటూ మండిపడ్డారు. అనంతరం శాసనసభ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధులను పారదర్శకంగా వాడాలి..

పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు కుమార్‌రాజా వర్ల మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని, ఆర్థిక సాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికలు, ప్రహరీలు, నీటి సదుపాయాన్ని కల్పించేందుకు ఉపాధి పథకం నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశ్రమలశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చిన్నచిన్న యూనిట్ల స్థాపనకు రూ.1500 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, అందులో రూ.184 కోట్లు శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించిందని తెలిపారు. ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికల ఏర్పాటు ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తమ నియోజకవర్గంలో వచ్చే నెలలో వంద శ్మశానవాటికలను ఒకేసారి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ, విజయ్‌చంద్ర సూచించారు. ప్రజలు ఇచ్చే అర్జీలను పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయిని కట్టడి చేయాలని సూచించారు. కమిటీ సూచనల మేరకు ఎస్సీ సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారంపై పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. డ్రగ్స్ అరికట్టడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు, సభ్యులను కలెక్టర్, ఎస్పీ, సోషల్ వెల్ఫేర్ జేడీ రెడ్డి బాలాజీ సత్కరించారు. ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డీఎఫ్ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, మహేష్, హేమంత్‌కుమార్, డీసీఓ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో వీఎన్ రెడ్డి అంత్యక్రియలు



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

పావగడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కల్లూరు సుబ్బరావు సమకాలికుడు వెంకటాపురం నరసింహారెడ్డి (వీఎన్ రెడ్డి) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం ఆయన స్వగ్రామమైన వెంకటాపురంలో నిర్వహించారు. కలెక్టర్ శుభకల్యాణి, డీఎస్పీ మంజునాథ్, తహసీల్దార్ రవి, మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు.. వీఎన్‌రెడ్డి భౌతికకాయాన్ని దర్శించి, పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనతోటలోనే అంతిమ సంస్కారాలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపించారు. తుది దర్శనం కోసం వేలాదిమంది ఆయన అభిమానులు, నాయకులు తరలివచ్చారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



నివాళి అర్పిస్తున్న డీఎస్పీ మంజునాథ్

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి ధర రూ.15 వేలు పలికాయని వివరించారు.

న్యూస్ బాక్స్

భూసార పరీక్షలు చేయించాలి



సిరివరంలో రైతులకు పురుగు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

గార్లదిన్నె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శివనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని సిరివరం, కనుంపల్లి, గుడ్డాలపల్లి, బూదేడు తదితర గ్రామాల్లో వర్షాధారం కింద సాగుచేసిన కంది, మినుములు తదితర పంటలను శివనారాయణతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి, సుధారాణి, మాధవి, బీకే క్రిష్ణారెడ్డి, శశికళ, చందన, రిడ్స్ సంస్థ డైరెక్టర్ కిష్టప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఎంతమోతాదులో ఎరువులు, మందులు వేసుకోవాలి, ఏ పంటలు సాగుచేసుకోవాలో తెలుసుకోవచ్చు అన్నారు. అనంతరం రూ.60వేలు విలువ చేసే పురుగు మందులను రైతులకు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో రిడ్స్ సంస్థ కో ఆర్డినేటర్ కేజీ రామాంజి, సీఆర్పీలు గోపి, గౌతమి, ఓబులపతి, రమేష్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరిస్తున్నారా..?: జడ్పీ సీఈఓ



బొమ్మేపర్తిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శివశంకర్

రాప్తాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోందా అని జడ్పీ సీఈఓ శివశంకర్ ఆరా తీశారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి దగ్గరా చెత్త సేకరిస్తున్నారా, ఎన్ని రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ అశోక్‌బాబు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి

రాప్తాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీఓ సావిత్రి మంగళవారం ప్రకటనలో తెలిపారు. గత నెల రోజుల నుంచి ఉపాధి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఈకేవైసి చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకూ 60 శాతం మంది కూలీలు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉపాధి పనులకు వెళ్లేందుకు వీలుండదని అన్నారు. ఇంటి నిర్మాణం, పండ్ల మొక్కల పెంపకం, గోకులం షెడ్ల నిర్మాణం ఇతర ఏ ఉపాధి పథకాలు పొందాలన్నా జాబ్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరకూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ సాంస్కృతికోత్సవాలు వాయిదా

అనంతపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ అకాడమీ, నటరాజ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించాల్సిన ఎన్టీఆర్ సాంస్కృతికోత్సవాలను వాయిదా వేశారు. ఈ మేరకు టీడీపీ అనంతపురం పార్లమెంట్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుపాన్ నేపథ్యంలో కార్యక్రమాన్ని నవంబరు నెలాఖరుకు వాయిదా వేశామని తెలిపారు. తదుపరి కార్యక్రమ నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ మునినారాయణప్ప

అనంతపురంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య మునినారాయణప్ప పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీలోని బీఎడ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యాపకుల బోధనలు శ్రద్ధగా విని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్, పర్యవేక్షకులు ఎంఎ లక్ష్మణరావు, అధ్యాపకులు రాజేశ్వరి, అనిత, శివానంద, సుధాకర్, నారాయణస్వామి, ఇంతియాజ్‌అహమ్మద్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఎంతమంది పాలకులు మారినా కార్మికుల తలరాతలు మారలేదన్నారు. పారిశుధ్య కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించి, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించానా ప్రయోజనం లేదన్నారు. అనంతరం ఎంహెచ్ఓ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అంపావతి గోవిందు, నాగరాజు, కుళ్ళాయప్ప, హనుమంతు, నరేంద్ర, గోపాల్, జిలాన్‌భాష, ఓబుళేసు, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు, మున్సిపల్ కార్మికులు

అయ్యా.. మా బాధలు వినండి..!

- అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ ముందుకు సమస్యలు
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామంటూ హామీ

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై పలువురు దళితులు తరలివచ్చి ఏపీ శాసనసభ ఎస్సీ కమిటీకి అర్జీల ద్వారా విన్నవించారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఉదయం శాసనసభ ఎస్సీ కమిటీ చైర్మన్ కుమార్‌రాజా వర్ల, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఎమ్మెల్యేలు ఎమ్మెఎస్‌రాజు, బోనెల విజయచంద్ర,రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ కులాల సమస్యలు తెలుసుకోవడానికి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున షెడ్యూల్ కులాలకు చెందినవారు తరలివచ్చి తమ బాధలు విన్నవించారు. కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు బాధితుల సమస్యలు సావధానంగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినతుల్లో కొన్ని..

● ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన పద్మావతి అనే దళిత మహిళ తన 47 సెంట్ల భూమిని రీసర్వేలో ఇతరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. మీరే న్యాయం చేయాలని కమిటీ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. దీంతో కమిటీ సభ్యులు ఆర్డీఓను పిలిపించి విచారించి, న్యాయం చేయాలని ఆదేశించారు.

● ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ నాయకుడు సాకే హరి నేతృత్వంలో పలువురు నాయకులు విద్యా సమస్యలను విన్నవించారు. ఎస్సీ హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కనీసం వాష్‌రూమ్స్‌కూడా లేవని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.

● గత వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన దళిత పథకాలను పునరుద్ధరించాలని, విదేశీవిద్యను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు అక్కులప్ప ఆధ్వర్యంలో కమిటీని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

దళితులకు భూమి పంచాలి

అనంతపురం వైద్యం: దళితులకు భూములు పంచాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ అక్కులప్ప శాసనసభ ఎస్సీ వెల్ఫేర్ కమిటీని కోరారు. కలెక్టరేట్‌లో కమిటీ నిర్వహించిన సమావేశానికి దళిత సంఘాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎమ్మార్పీఎస్ అక్కులప్ప, మాల మహానాడు జిల్లా ధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. దళితులకు గురుకుల పాఠశాలలు, శ్మశానవాటికలు నిర్మించాలని వి



వినతులు స్వీకరిస్తున్న శాసనసభ కమిటీ సభ్యులు

న్నవించారు. కలెక్టరేట్ ఎదుట మాజీ సీఎం దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రుద్రంపేటలోని అంబేడ్కర్ భవన్‌లో ఉన్న పోక్సో కోర్టును తరలించి అక్కడ డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పోలీస్‌శాఖలో ప్రమోషన్లకు రిజర్వేషన్ల నిబంధనలు పాటించడంలేదని జిల్లా పోలీస్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివానంద ఆవేదన వ్యక్తం చేశారు. స్టడీ లీవ్‌లు మంజూరు చేయాలని ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో కమిటీకి వినతిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ కుమార్, చెన్నప్ప, సుంకన్న, సురేష్, సంపత్‌కుమార్, గంగాధర్, శ్రీనివాసులు, రాము, ముత్యాలరాజ్, ఆదినారాయణ, వినోద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఎస్కేయూ ఎంఈఎఫ్ ప్రధాన కార్యదర్శి నారాయణప్ప పేర్కొన్నారు. ఎస్కేయూ సమస్యలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కమిటీ కన్వీనర్ యనమల ప్రసాదు ఆధ్వర్యంలో శాసనసభ కమిటీ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు.

అనంతపురం క్లాక్‌టవర్ : శానిటేషన్ కార్మికుల పట్ల వివక్ష తగదని ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ కమిటీ చైర్మన్ కుమార్‌రాజాని కలిసిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అజయ్‌బాబు, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు తిరుపాల్, ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, నాయకులు వెంకట నరసయ్య, శశిభూషణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తల్ని చేసింది చంద్రబాబే: ఎమ్మెల్యే

అనంతపురం క్రైం/ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వంటింట్లో ఉండే మహిళలను వ్యాపారవేత్తల్ని చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, మన డబ్బులు- మన లెక్కలు యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 322 స్వయంసహాయక సంఘాలకు చెందిన 1691 మంది సభ్యులకు రూ. 20.30 కోట్ల రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సంఘాల సభ్యుల డబ్బుల విషయంలో అనేక మోసాలు జరిగేవని అన్నారు. మన డబ్బులు- మన లెక్కలు యాప్ ద్వారా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులు వివరాలు సెల్‌ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చు అన్నారు. మహిళలంటే సీఎం చంద్రబాబుకు ఎంతో గౌరవం అని అన్నారు. డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చింది సీఎం చంద్రబాబేనని, దీంతో మహిళలకు ఇళ్లలో ఎంతో గౌరవం పెరిగిందన్నారు. ఎలాంటి ష్యూరిటీ లేకుండా రుణాలు తీసుకుంటున్నది ఒక్క మహిళా



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

సంఘాల సభ్యులే అన్నారు. 4శాతం వడ్డీతో విద్యాలక్ష్మి పథకం ద్వారా పిల్లల చదువులకు, కల్యాణలక్ష్మి ద్వారా పిల్లల వివాహాలకు రుణాలు ఇస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల సేవ గొప్పది: ఎంపీ అంబికా



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సేవ తల్లిదండ్రులకు చేసే సేవతో సమానమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వాసవీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మందుల పంపిణీ చేశారు. వృద్ధులకు రూ.50 వేల విలువైన మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వృద్ధులను గౌరవించాలని, వారికి అవసరమైన సహాయం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది కూడా లక్ష విలువైన మందులను 12 వృద్ధాశ్రమాలకు అందించినట్లు తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం ఒక డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని వృద్ధులు కోరారు. దీనికి ఎంపీ స్పందిస్తూ...ప్రతి నెలా అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినీ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వీక్షిత్, వృద్ధాశ్రమ కార్యదర్శి నాగభూషణం, ఆర్యవైశ్య సంఘం నాయకులు గోప మచ్చానర్సింహులు, నాగరత్నం, రామనాథం, సత్యరాం, శిప్రసాద్, నాగరాజు, సాయి, నవజ్యోతి పాల్గొన్నారు. రెవెన్యూ కాలనీకి చెందిన సంధ్యారాణికి ఎంపీ సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 6,16,068 చెక్కు అందజేశారు.

ద్విచక్రవాహనం చోరీ

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకాష్ రోడ్డులో తన ఇంటి ముందున్న ద్విచక్రవాహనం చోరీకి గురైందని బాధితుడు శ్రీనివాసులు మంగళవారం టూటౌన్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈనెల 27న ఇంటి ముందు పార్క్ చేశానని తెలిపాడు. చోరీకి గురికావడంతో మంగళవారం ఫిర్యాదు చేశానని వివరించాడు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నగరంలోని వెంకటేశ్వనగర్ సమీపంలో ఐదుగురు జూదరులను వన్‌టౌన్ పోలీసులను అరెస్టు చేశారు. వారి నుంచి 1600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

రెడ్డెప్పరెడ్డి మృతికి నివాళి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి మృతి బాధాకరమని ఆ బ్యాంకు సీఈఓ సురేఖరాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో సంతాపసభ నిర్వహించారు. రార్యక్రమంలో డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారి అనంతపద్మనాభం పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో ఏపీఎన్జీఓ సభ్యత్వ నమోదు

అనంతపురంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల ఐసీడీఎస్ కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ సభ్యత్వ నమోదు చేపట్టారు. మంగళవారం ఏపీ ఎన్జీ ఓవో నగర శాఖ అధ్యక్షప్రధానకార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, గంగాధర్, శివప్రసాద్, మూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహించకండి: ఏసీబీ సీఐ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని ప్రోత్సహించవద్దని ఏసీబీ సీఐ మోహన్‌కుమార్ సూచించారు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణంలో అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులకు లంచం ఇవ్వకూడదని సూచించారు. లంచం ఇచ్చినా, తీసుకున్నా నేరమని అన్నారు.

విద్యార్థిని అదృశ్యం

రాప్తాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లికి చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. విద్యార్థిని పాలిటెక్నిక్ చదువుతోందని అన్నారు. నాలుగు నెలల నుంచి ఆరోగ్యం బాగా లేనందును ఇంటి దగ్గరే ఉందని తెలిపారు. ఈ నెల 26న కళాశాలకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందని అన్నారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు చేశారని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాప్తాడు తెలిపారు.

ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యం... ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు నగరంలోని 28 ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తామని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో ఉన్న నీరు-ప్రగతి పార్కును నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి పరిశీలించారు. పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజెన్స్‌తో కలిసి కలియతిరుగుతూ జిమ్ పరికరాలు, ఇతరత్రా వాటిని పరిశీలించారు. దెబ్బతిన్న జిమ్ పరికరాలను వెంటనే మార్చాలని ఏఎంసీ అధికారులకు సూచించారు. పార్కులో షెడ్డుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అకడమిక్ కన్సల్టెంట్లకు న్యాయం చేయండి

అనంతపురంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అకడమిక్ కన్సల్టెంట్లకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఈ మేరకు వైస్ చాన్స్‌లర్ అనితను కలసి వినతి పత్రం ఇచ్చారు. తెలుగు శాఖలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అకడమిక్ కన్సల్టెంట్లను ఇబ్బంది కలిగించే విధంగా, ఉద్దేశపూర్వకంగా ప్రస్తుత తెలుగు శాఖ అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారని అన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

అనంతపురంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యాదవులకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని యాదవ సంఘం మాజీ కమిటీ నాయకులు నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం రుద్రంపేటలోని యాదవ కల్యాణమండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యాదవ కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్‌యాదవ్, రాముడు యాదవ్, సందీప్ యాదవ్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

గార్లదిన్నె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంజీవపురం సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.22,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. మండలంలోని ఎక్కడైనా పేకాట, మట్కా తదితర జూదాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి: డీఎల్‌డీఓ

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌డీఓ నాగశివలీల పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సొంత వనరుల పెంపుదలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ దివాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎల్‌డీఓ నాగశివలీల, ఎంపీపీ వరలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ..ప్రస్తుతం సచివాలయాల్లో ఎక్కువగా యువతీ, యువకులే ఉన్నారన్నారు. మూసధోరణిలో కాకుండా ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధికోసం పనిచేయాలన్నారు.

● రాప్తాడు : గ్రామ పంచాయతీకి ఆదాయ వనరులు సృష్టించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి : పంచాయతీ సొంత ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగశివలీల

మాన్ని రామగిరి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, రిసోర్స్‌పర్సన్ రాజేంద్ర, సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

● శింగనమల: పంచాయతీల అభివృద్ధికి సర్పంచులే కీలకమని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. ఆదాయ వనరులపై సర్పంచులు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాపంపేట భూములపై ఐక్య ఉద్యమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాపంపేట శోత్రియం భూములను కాపాడుకోవడానికి ఐక్యఉద్యమానికి ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా క్రయవిక్రయాలు జరిగాయన్నారు. స్థలాలు కొని ఇల్లు నిర్మించుకొని వేలాది మంది నివసిస్తున్నారన్నారు. చట్టంలోని లొసుగులతో ఖాళీ స్థలాల్లోబోర్డులను ఏర్పాటు చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. ఈనెల 31 సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ బాధితుల తరఫున వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీ రాములు, అల్లీపీరా, కేశవరెడ్డి, రమణయ్య, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులది దోపిడీ పాలన

ఆత్మకూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ నాయకులు దోపిడీ పాలన సాగించారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ మండల కన్వీనర్ బాలపోతన్న మండల వైసీపీ నాయకుడు వాసుదేవరెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అండదండలతో ఎంతో మంది అమాయకులను మోసం చేశారని విమర్శించారు. ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు శశాంకచౌదరి, శ్రీనివాసులరెడ్డి, ఓబుళపతి, ఆనంద్, పూల్లారెడ్డి.నరసింహులు, కుళ్లాయి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై కేసు

కనగానపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిపై దురుసుగా ప్రవర్తించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మికి వంట ఏజెన్సీ నిర్వాహకులు నాగేంద్రతో నాలుగురోజుల క్రితం గొడవ జరిగింది. ఉన్నతాధికారులు రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. ఉపాధ్యాయురాలు తనకు జరిగిన అవమానాన్ని భరించలేక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు నాగేంద్రతో పాటు మరో ఇద్దరిపై ఎస్సీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో హమాలీ మృతి

గార్లదిన్నె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం నెట్టికల్లు (48) అనే వ్యక్తి పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కల్లూరు స్టేట్ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న నెట్టికల్లు హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కల్లూరులో ఓ ఇంట్లో పాము వచ్చిందని మహిళలు కేకలు వేశారు. దీంతో పట్టుకునే క్రమంలో పాము కాటుకు గురయ్యాడు. పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇంటి పునాదిని ధ్వంసం చేశారని ఫిర్యాదు

నార్పల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నార్పల పంచాయతీలో జగనన్న కాలనీలో నిర్మించుకున్న పునాదిని రెవెన్యూ అధికారులు బలవంతంగా ధ్వంసం చేశారని బాధితురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. జగనన్న కాలనీలో మూడుసంవత్సరాల నుంచి రేకుల షెడ్డు వేసుకుని నివాసముంటున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఈ స్థలం వేరేవారికి పట్టా ఇచ్చామని రేకుల షేడ్‌ను తొలగించారు. దీంతో భాగ్యలక్ష్మి తహసీల్దార్ అరుణకుమారి, సీఐ కౌలుట్లయ్యకు ఫిర్యాదు చేశారు.

అట్టహాసంగా కాన్ఫరెన్స్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, టీచర్లు, తల్లిదండ్రులు

అనంతపురం విద్య, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ద్వారకానగర్‌లో గల నారాయణ పాఠశాలలో స్టూడెంట్స్‌లెడ్‌కాన్ఫరెన్స్ అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతి, తయారుచేసిన నైపుణ్యాలు, ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులను అబినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అస్మాఖాన్, ఆర్ అండ్ డీ భారతి, క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాళ్లు సుజాత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పీహెచ్‌సీ భవనం

దర్గాహొన్నూరులో నిర్మించి రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోని వైనం

బొమ్మనహాళ్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులో రూ. రెండు కోట్లతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని రెండేళ్ల క్రితం నిర్మించారు. నేటికీ దాన్ని నియోగించకుండా అధికారులు తాళమేసి ఉంచారు. ఆరోగ్యశాఖ అధికారులు పరికరాలు రాలేదంటూ భవనాన్ని తెరవకుండా అలాగే వదిలేశారు. వైద్య సిబ్బంది విలేజ్ క్లీనిక్‌లో ఇరుకు గదుల్లోనే వైద్యం అందిస్తున్నారు. అందులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు బళ్లా రి, రూపనగుడి, ఉరవకొండ ప్రాంతలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ ఆసుపత్రి భవనం ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దర్గాహొన్నూరులో నిరుపయోగంగా ఉన్న పీహెచ్‌సీ భవనం

న్యూస్ బాక్స్

నష్టపోయిన చేనేతల వివరాల సేకరణ

ఉరవకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో అవి దెబ్బతిన్నాయి. ఆ మగ్గాలను చేనేత జౌళిశాఖ, రెవెన్యూ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి మంగళవారం పరిశీలించారు. ఇంద్రానగర్, లక్ష్మీనరసింహకాలనీ, 10వ వార్డులో మగ్గాలను సందర్శించి.. నష్టపోయిన చేనేత కార్మికుల వివరాలు సేకరించామని, వాటిని ఉన్నతాధికారులకు పంపుతామని ఏడీ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ బాషా, చేనేత జౌళిశాఖ అధికారులు మురళి, హరిప్రసాద్, ఆర్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బ్రహ్మసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా కక్షలు, కార్పణ్యాలతో ఉన్న ఈ గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని, వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక విద్యార్థిని శకుంతలను ఎమ్మెల్యే అభినందించి నగదు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దరాంపురంలో గ్రామదేవత..



బొమ్మనహాళ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరాంపురంలో మంగళవారం గ్రామదేవత శ్రీ దేవమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, హోమాలు, పూర్ణహుతి చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు మహేంద్ర, ప్రభయ్యస్వామి, గంగధర పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పామిడి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పామిడి మేజర్ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డిప్యూటీ ఎంపీడీఓ దామోధర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. గతంలో ఈఓ గోపాల్ పనిచేసిన సమయంలో నిధులు దుర్వినియోగంపై అభియోగాలు రావడంతో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి

కుందుర్పి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోయ చిత్తప్ప (65) అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. ఆయన మృతదేహానికి మండల టీడీపీ అధ్యక్షుడు ధనుంజయ, మండల ఎస్సీసెల్ కన్వీనర్ వెట్టి హనుమంతరాయుడు, పార్టీ నాయకులు గిడ్డప్ప, తిప్పేస్వామి యాదవ్, ఓబన్న, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్, పోలింగ్ బూత్ కన్వీనర్ విజయ్‌కుమార్, రమేష్, సునీల్ కుమార్ నివాళులర్పించారు.

● బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుండ్లయప్ప తిమ్మయ్య(70) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప మంగళవారం నివాళులర్పించారు.అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు.

రైతుసంఘం ఏర్పాటు

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం మండల మహాసభ నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడిగా రాజారామిరెడ్డి, కార్యదర్శిగా నాగరాజు, 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

బొమ్మనహాళ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మండలంలోని శ్రీధరఘట్ట హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, టీడీపీ నగరా సంఘం జిల్లా ఆధ్యక్షుడు రవిచంద్రసాగర్ అన్నారు. మంగళవారం శ్రీధరఘట్టలో రవిచంద్రసాగర్ 200 మొక్కలు నాటించారు. యువతతో కలిసి పాఠశాల అవరణంతోపాటు గ్రామంలోని పలు చోట్ల ఈ మొక్కలు నాటారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే గ్రామం పచ్చగా, ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ డ్యానీ, టీడీపీ యువనాయకులు అనిల్, పురంధర, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్ పాల్గొన్నారు.

కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

యల్లనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాయిపల్లి గ్రామ సమీపంలోని ఓబులేసుస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అచ్యుతాపురం రామచంద్రారెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం భక్తులతో నిర్వహించిన సమావేశంలో పాతదేవాలయ స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించాలని తీర్మానించారు. ఆలయ నిర్మాణానికి అధ్యక్షుడు రూ.15 లక్షలు, యల్లనూరు వాల్మీకి సంఘం రూ.15 లక్షలు, ధర్మవరానికి చెందిన సంజీవులు రూ.10లక్షలు, మల్లాగుండ్ల గ్రామానికి చెందిన కొండారెడ్డి కుటుంబీకులు రూ.5లక్షలు విరాళాన్ని ప్రకటించారు.

పయ్యావుల శ్రీనివాసులుకు సన్మానం



కూడేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూడేరుకు చెందిన శిరీష, బ్రహ్మణపల్లికి చెందిన వందన ఇటీవల ఆశావర్కర్లు నియమితులయ్యారు. వీరు అనంతపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి.. సన్మానించారు. వారి వెంట సీహెచ్‌ఓ సరోజ, యశోద, సూపర్‌వైజర్ రవీంద్ర, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి: డ్రగ్స్ ఏడీ

పామిడి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని డ్రగ్స్ ఏడీ వీరకుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ ప్రమాదాలు-యువత భవిష్యత్తు భద్రత అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌రెడ్డి, మాధవి, పామిడి సీఐ యుగంధర్, ఈగల్ ఎస్‌ఐ హనుమంతు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అక్కులన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి ఉన్నవారు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని, లబ్ధిదారుడికి రూ.15వేలు ప్రోత్సాహం అందుతుందని అన్నారు. దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడికి సన్మానం



రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

ఉరవకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు బాల వెంకటేష్, రాఘవేంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు.

కందిలో పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోండి

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కంది పూత రాలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు నారాయణస్వామి, కళ్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని ఉండబండ గ్రామంలో కంది పంటను పరిశీలించిన వారు మాట్లాడారు. కంది, వేరుశనగ పూత రాలడాన్ని నివారించటానికి ప్లానఫిక్స్ 4గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పంటలపై పిచికారీ చేయాలన్నారు. మరుకా, మచ్చలు ఉన్నట్లు అయితే బెంజెట్, ల్యామ్డా, సైహాలోత్రిన్, కొరజాన్, గాని ఎకరాకు 150 గ్రాములు మందును 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలకు పిచ్చికారి చేయాలన్నారు. అధిక తేమ లేకుండా నీరు కిందికి పారేలా చర్యలు చేట్టాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ కైలాసనాథ్ పాల్గొన్నారు.

● ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలో వేరుశనగ, కంది పంటలను శాస్త్రవేత్తలు నారాయణస్వామి, నరసింహులు, లక్ష్మి కల్యాణి, ఏడీఏ సత్యనారాయణ, ఏవో రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. రాబోవు 24గంటలు వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయని, వేరుశనగ పంటను తొలగించవద్దని సూచించారు. కంది పూత దశలో ఉందని, పూత రాలిపోయే ప్రమాదం ఉన్నందున దాని నివారణకు క్లోరో నెత్రానిల్‌ప్రోల్ అనే మందును లీటరు నీటికి 0.5 మిల్లీలీటర్ కలిపి పిచికారి చేయాలన్నారు. కంది పూత, కాయ పెరుగుదల కోసం 19:19:19 మందును ఎకరాలకు 1కేజీ చొప్పున పిచికారి చేయాలన్నారు.

శిక్షణకు ప్రజాప్రతినిధులు గైర్హాజరు

బొమ్మనహాళ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సొంత ఆదాయం (ఓఎస్‌ఆర్) పెంపుపై రెండురోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. అయితే ఈ శిక్షణకు మొదటి రోజే ప్రజాప్రతినిధులైన సర్పంచులు గైర్హాజరు అయ్యారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఉదయం 9.30 గంటలకు ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. బొమ్మనహాళ్, నేమకల్లు గ్రామ సర్పంచ్‌లు వన్నమ్మ, పరమేష్ 11 గంటలకు హాజరయ్యారు. మరో ఇద్దరు సర్పంచ్‌లు గాధిలింగ, ముక్కన్న అలస్యంగా వచ్చి వెళ్లిపోయారు. మిగతా సర్పంచులు ఎవరూరాలేదు. ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటలకే శిక్షణ ప్రారంభమైంది.

● ఇద్దరు సర్పంచులే హాజరు

శెట్టూరు : గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళికపై గ్రామ సర్పంచలు, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు శెట్టూరు, అనంపల్లి గ్రామ సర్పంచ్‌లు ఇద్దరే హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ శిక్షణ తరగతులపై ఆసక్తి చూపకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఘనంగా కలశ పూజ

గుంతకల్లుటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో కలశ స్థాపన, కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా నూతన కలశాలకు అర్చకులు, వేద పండితులు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. టీడీపీ గుంతకల్లు ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, సింగిల్ విండ్ చైర్మన్ తలారి మస్తానప్ప, మండల అధ్యక్షుడు రామన్న చౌదరి నూతన కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ పాల్గొన్నారు.



కలశంతో టీడీపీ నాయకులు, అర్చకులు

క్రైం న్యూస్..

టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. కొత్తూరుకు చెందిన వైసీపీ కార్యకర్త పాతలింగ మద్యం మత్తులో టీడీపీ నాయకులను దూషించసాగాడు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఇందులో దాదాపు ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆరుగురిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై రూరల్ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

ముగ్గురికి గాయాలు

గుంతకల్లు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసులుడికి గ్రామ శివారులో మొలకలపెంట గ్రామ వాసి దిమ్మగుడి రాము వెళ్తున్న బైక్, మొలకలపెంట గ్రామానికి చెందిన తిక్కస్వామి, సేవాలాల్ నాయక్ వెళ్తున్న బైక్ మంగళవారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం ఆ ముగ్గురు గాయపడ్డారు. వీరిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రామును పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కసాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

త్రిశూలం విరగ్గొట్టాడని ఫిర్యాదు

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌బజారులోని పెద్దమ్మగుడి ఆలయం ఎదురుగా ఉన్న త్రిశూలాన్ని అదేకాలనీకి చెందిన రంగనాథ్ విరగ్గొట్టాడని కమిటీ సభ్యులు సుబ్బయ్య, శ్రీనివాసులు , మరికొంతమంది పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ గౌస్‌బాషా ఆ ఆలయాన్ని సందర్శించారు. అతనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వీఆర్‌ఏపై వీఆర్వో దాడి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భూసమస్య విషయంలో తనపైనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తావా అంటూ వీఆర్వో విష్ణువర్ధన్ తనపై వారం క్రితం వేపరాలలో దాడి చేసినట్లు వీఆర్‌ఏ మల్లికార్జున మంగళవారం వాపోయాడు. భూసమస్య పరిష్కరించాలని తాను నెలరోజుల నుంచి తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌ను కోరానని, ఈ విషయంపై వీఆర్వో తనతో గొడవపడి కొట్టినట్లు తెలిపారు. వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాయలచెరువుకు జలకళ

యాడికి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు గ్రామంలోని చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కిష్టిపాడు హెడ్ రెగ్యులేటరీ వద్ద నుంచి నీటిని యాడికి కాలువ ద్వారా చెరువుకు మళ్లించారు. చెరువులో 75శాతం నీళ్ల వచ్చాయని చెరువు పూర్తిగా నిండితే చుట్టుపక్కల 17గ్రామాల ప్రజలకు బోరుబావుల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయని గ్రామస్థులు తెలిపారు. చెరువు వద్ద మరువను హెచ్చెల్సీ డీఈ చెన్నారెడ్డి మంగళవారం పరిశీలించారు. చెరువుకట్ట భద్రతపై ఆరాతీశారు.

సీఎంకి ఫిర్యాదు చేసినా స్పందించరా..?

రెవెన్యూ అధికారులపై రైతు ఆగ్రహం

పుట్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని మండలంలోని ఓబులాపురం రైతు నాగభూషణం మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబులాపురంలోని 33సర్వేనెంబర్‌లో ఆరు ఎకరాల పొలం ఉందని, వాటికి పూర్వం నుంచి రస్తా ఉందని అన్నారు. రస్తా లేదని వేరే రైతులు అడ్డగించడంతో రెండునెలల క్రితం సీఎంకు ఫిర్యాదు చేశానని, అధికారులకు సమస్య పరిష్కరించాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అండర్-14 బాలికల విభాగంలో ఖోఖో పోటీలను మంగళవారం నిర్వహించారు. ఖోఖో విజేతగా ఎస్‌జేపీ హై స్కూల్, రన్నర్‌గా సరోజినీనాయుడు బాలికల ఉన్నత పాఠశాల జట్టు నిలిచింది. అండర్-14 బాలుర విభాగంలో ఎస్‌జేపీ హైస్కూల్ విజేతగా, రన్నర్‌గా భాష్యం పాఠశాల జట్టు నిలచింది. అండర్-17 బాలికల విభాగంలో సరోజినీనాయుడు బాలికల ఉన్నత పాఠశాల విజేతగా, కసాపురం జడ్పీపాఠశాల జట్టు రన్నర్‌గా నిలచింది. చెస్ అండర్-14బాలుర విభాగంలో భాష్యం, అండర్-14బాలికల విభాగంలో మాంటిస్సోరి ఉన్నత పాఠశాల, అండర్-17 బాలుర విభాగంలో రోటరీ హైస్కూల్, అండర్-17 బాలికల విభాగంలో సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు.

● **శెట్టూరు**: మండలంలోని యాటకల్లు ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్కూల్ గేమ్స్ నిర్వహించారు. అండర్-14, అండర్-17 క్రీడా విభాగాల్లో బాలబాలికలకు వంద మీటర్లు, రెండు వందల మీటర్లు, ఆరు వందల మీటర్లు, ఎనిమిది వందల మీటర్లు, 1500 మీటర్లు, మూడు వేల మీటర్లు, లాంగ్ జంప్, హై జంప్ డిస్కస్‌త్రో బాల్ , జావలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాల, మోడల్ స్కూలు నుంచి విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు శివ కేశవులు, శ్రీనివాసులు, శిరీష, రామాంజినమ్మ, మహేష్, అనిల్, తిమ్మప్ప, బాషా పాల్గొన్నారు.

● **బొమ్మనహాళ్** : మండలంలోని గోవిందవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. అండర్ 14, 17 బాల, బాలికలకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. 25 మంది విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజసూర్యుడు, పీఈటీ బోగేష్ తెలిపారు.



గుంతకల్లు: ఖోఖోలో విజేతగా నిలిచిన బాలికల జట్టు

అభివృద్ధిపై విశ్వాసం నెగ్గేనా..?

● టీడీపీకి ఆరుగురు వైసీపీ ఎంపీటీసీల మద్దతు

● ఒక్క ఎంపీటీసీ కోసం వైసీపీ రాయబేరాలు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రి పయ్యావుల కేశవ్ మండలంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడైన వైసీపీ నేత, ఎంపీపీ పెద్దన్న టీడీపీలో చేరారు. అనేక మంది వైసీపీ ఎంపీటీసీలు టీడీపీకి మద్దతుపలికారు. దీంతో ఎలాగైన ఎంపీపీ పెద్దన్నను ఆ పదవి నుంచి తొలగించడానికి వైసీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. వైసీపీ పాలనలో 12 ఎంపీటీసీ స్థానాలనూ ఆ పార్టీ వారే కైవశం చేసుకున్నారు. ఎంపీపీగా రెండున్నరేళ్ల పెద్దన్న.. మరో రెండున్నరేళ్ల శ్రీరంగాపురం ఎంపీటీసీ వరలక్ష్మీ పదవిలో ఉండేలా నాడు పార్టీ నాయకులు మొదట నిర్ణయించారు. అయితే పెద్దన్న గడువు ముసిగినా... మహిళా ఎంపీపీగా ఉండి పరిపాలన కొనసాగించడం ఇబ్బందిగా ఉంటుందని, ఎంపీపీగా పెద్దన్ననే ఉండాలని నియోజకవర్గ నాయకుడు ఆదేశాల మేరకు ఆయన్ను కొనసాగించారు. ఇక మరో నాలుగు నెలల్లో ఆ పదవి కాలమూ పూర్తి కానుంది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థిక శాఖ మంత్రిగా ఉండటంతో అభివృద్ధి పరుగులు తీసింది. ఇటీవల నిర్వహించిన మండల సమావేశంలో ఎంపీపీ పెద్దన్న మాట్లాడుతూ.. 'మన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నారు. అభివృద్ధి బాగా చేస్తున్నారు. సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం. ఇది మంచి అవకాశం.. సద్వినియోగం చేసుకుందాం.' అని మంత్రిని ప్రశంసించారు. దీన్ని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. పెద్దన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి సిద్ధమయ్యారు. అంతేకాకుండా గతంలో మాట్లాడుకున్న ఒప్పందాన్ని తెరపైకి తెచ్చారు. కాలపరిమితి ముగిసిందని, ఎంపీపీగా దిగిపోవాలని డిమాండ్ చేశారు. దీంతో అభివృద్ధివైపు మొగ్గు చూపిన పెద్దన్న.. మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఎలాగైనా పెద్దన్నను ఎంపీపీగా తొలగించాలని.. అవిశ్వాసం పెట్టాలని.. పది మంది ఎంపీటీసీలు ఆర్డీఓ వద్ద సంతకాలు చేశారు. కాగా, ప్రస్తుతం తగ్గుపర్తి, బెళుగుప్ప, బెళుగుప్ప తండా ఎంపీటీసీ పెద్దన్నకు అనుకూలంగా ఉన్నారు. ఈనెల 17న నిర్వహించిన మండల సమావేశానికి కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. దీంతో వైసీపీలో ఆశలు సన్నగిల్లాయి. అవిశ్వాసంలో నెగ్గాలంటే 12 మంది ఎంపీటీసీల్లో ఎనిమిది మంది మద్దతు అవసరం. కాని ఏడుగురే ఉన్నారు. మరో ఎంపీటీసీ మద్దతు తప్పనిసరి. కాలువపల్లి ఎంపీటీసీని తమ వైపు తిప్పుకుంటే నెగ్గుతామన్నా ఆలోచనతో వైసీపీ నాయకులు రాయబేరాలు నడుపుతున్నారు. టీడీపీ నాయకులు కూడా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఎన్నికుట్రలు పన్నినా తమదే విజయమంటూ టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీకి మద్దతిచ్చిన వైసీపీ ఎంపీటీసీలు